క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు భాగ్యనగర్ విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్‌ఎంటీహిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని భాగ్య నగర్‌కాలనీలో ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు...

◆ ఆదిత్యనగర్ ఫీడర్ పరిధిలోని తులసీనగర్, హెచ్‌ఎంటీహిల్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 3.30గంటల వరకు...

◆ ఎన్‌టీఆర్‌నగర్ ఫీడర్ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్, సిక్కు కాలనీల్లో మధ్యాహ్నం 3.45 నుంచి 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

త్వరలో పశువుల ఆస్పత్రి ప్రారంభం



పశువుల ఆస్పత్రి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్

కూకట్‌పల్లి: డివిజన్‌లో నిర్మిస్తున్న పశువుల ఆస్పత్రి పనులను శుక్రవారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రూ.70లక్షల నిధులతో నిర్మిస్తున్న పనులను పూర్తి చేసి త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శివప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

కూకట్‌పల్లి: మాజీ దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతిని రమ్యాగ్రౌండ్ వద్ద వైఎస్సార్‌సీపీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. అన్నదానం కార్యక్రమం ఉంటుందని సేవాదళ్ అధ్యక్షుడు గాలిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ అభిమానులు, కార్యకర్తలు, కేపీహెచ్‌బీ కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

భాగ్యనగర్‌కాలనీ: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ మెట్రో ఫుట్‌పాత్ బ్రిడ్జి కింద సుమారు 45 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు 108కి సమాచారం అందించగా విషయం తెలుసుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవటంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ప్రత్యర్థులెవరు..



బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఖరారుతో.. నియోజకవర్గాల్లో ప్రచార హోరు

- ఇమడలేక.. వెళ్లలేని సంకట స్థితిలో మైనంపల్లి, బేతి సుభాష్‌రెడ్డి
- కాంగ్రెస్, బీజేపీలలో టికెట్ కోసం పలువురి నేతల ప్రయత్నాలు
- అభ్యర్థుల ఎంపికపై అధిష్టానం కసరత్తు.. ఆశావహుల్లో ఉత్కంఠ
- ఎన్నికల వేళ.. మేడ్చల్ జిల్లాలో రాజకీయ 'సందడి'

సాక్షి, మేడ్చల్ జిల్లా: బరిలో నిలిచేదెవరు? గులాబీ పార్టీ అభ్యర్థులను ఢీకొట్టేదెవరు? అనే చర్చ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఊపందుకుంది. అనూహ్యంగా అధికార బీఆర్‌ఎస్ జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీలో నిలిపే వారి పేర్లను ఖరారు చేయటంతో అభివృద్ధి కార్యక్రమాలతో పేరుతో ప్రచార హోరుతో ప్రజలకు వద్దకు వెళ్తున్నారు. ఉప్పల్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డిని కాదని కొత్త వారికి ఇవ్వగా.. మల్కాజిగిరిలో సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లికి టికెట్ ఇచ్చినప్పటికీ, తనయుడికి మెదక్ టికెట్ కేటాయించలేదని అధిష్టానంపై ఆగ్రహంతో ఉన్నారు. ఈ ఇద్దరు సిట్టింగ్‌లు బీఆర్‌ఎస్‌లో ఇమడలేక.. బయటకు వెళ్లలేని సంకట పరిస్థితిలో సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. మరో పక్క అధికార పక్షం అభ్యర్థులకు దీటుగా.. విపక్షాలు ఎవరిని రంగంలోకి దింపుతాయనే ఉత్కంఠ అందరిలో ఉంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ వ్యూహాలేంటి అన్న చర్చ కూడా జోరుగా సాగుతుండగా.. ఆ పార్టీలకు చెందిన ఆశావహులు మాత్రం పలు రాజకీయ, సామాజిక సమీకరణాల నేపథ్యంలో టికెట్ తమకే లభిస్తుందనే ధీమాతో వివిధ కార్యక్రమాల పేరుతో ప్రజల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ల కోసం ఇప్పటికే పలువురు దరఖాస్తు చేసుకోగా, అధిష్టానం వడపోత కార్యక్రమాన్ని మొదలు పెట్టింది.

మల్కాజిగిరి

నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును అధిష్టానం ప్రకటించినా.. తనయుడు రోహిత్‌కు మెదక్ టికెట్ కేటాయించలేదన్న అసంతృప్తితో మంత్రి హరీష్‌రావుపై నిప్పులు చెరిగారు. ఈ విషయంలో మైనంపల్లి తీరుపై సీఎం కేసీఆర్ సహా వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రుగా ఉండగా, అధిష్టానం కూడా ఆయనపై వేటుకు రంగం సిద్ధం చేసినట్లు బీఆర్‌ఎస్‌లో చర్చ సాగుతోంది. బీఆర్‌ఎస్‌లో ఉండలేక.. బయటకు వెళ్లలేని సంకట పరిస్థితిని మైనంపల్లి ఎదుర్కొంటుండగా, అధిష్టానం కూడా మైనంపల్లిపై చర్యలకు సిద్ధపడకుండా మెత్తపడినట్లు ప్రచారం. ఒకవేళ అధిష్టానం మైనంపల్లి హన్మంతరావుపై సీరియస్‌గా వ్యవహరిస్తే.. మల్కాజిగిరి నుంచి మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి లేదా ఎమ్మెల్సీ శంబీపూర్ రాజును బరిలో దింపవచ్చనే చర్చ సాగుతోంది. మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం ముగ్గురు నాయకులు దరఖాస్తు చేసుకున్నా పార్టీ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్‌కే దక్కుతుందని పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. మరో ఇద్దరు అన్నె వెంకట సత్యనారాయణ, బోనగిరి సురేష్‌యాదవ్ ఉన్నారు. మల్కాజిగిరిలో బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, కొత్తగా పార్టీలో చేరిన ఆకుల రాజేందర్, యువమోర్చా నాయకుడు భానుప్రకాష్ పోటీ పడుతున్నారు.

మేడ్చల్

సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి చామకూర మల్లారెడ్డికి మళ్లీ మేడ్చల్ టికెట్ దక్కడంతో బలమైన పోటీదారుడుగా ప్రచార పర్వంలో ముందువరుసలో ఉన్నారు. గడపగడపకూ కాంగ్రెస్ అనే నినాదంతో పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూరి వజ్రేష్(జంగయ్య)యాదవ్, అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ప్రజల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇక్కడి నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం వీరితోపాటు రోయ్యపల్లి మల్లేష్‌గౌడ్, పిసరి మహిపాల్‌రెడ్డి, పి.బాలేష్, గువ్వ రవి దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీ సామాజిక వర్గానికి టికెట్ ఇస్తే తొటకూరి వజ్రేష్(జంగయ్య)యాదవ్, రెడ్డి సామాజిక వర్గానికి కేటాయిస్తే హరివర్ధన్‌రెడ్డికి దక్కవచ్చనే ప్రచారం ఆ పార్టీలో సాగుతోంది. బీజేపీ నుంచి పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు కొంపెల్లి మోహన్‌రెడ్డి, రూరల్ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డితో సహా రాష్ట్ర స్థానిక సంస్థల అధ్యక్షుడు, రాష్ట్ర ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి.

ఉప్పల్

◆ ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డిని కాదని, బండారి లక్ష్మారెడ్డికి బీఆర్‌ఎస్‌కు అధిష్టానం టికెట్ కేటాయించడంతో కార్యకర్తల సమావేశాల పేరుతో నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. దీంతో సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తానేని తప్పు చేశానో చెప్పకుండా..టికెట్ నిరాకరించడంపై ఆయన గుర్రుగా ఉన్నారు. అనుచరులు, కార్యకర్తలతో చర్చించి పది రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తానని పేర్కొన్న తీరుపై పార్టీలో తీవ్ర చర్చ సాగుతోంది. అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి మాత్రం ప్రజల మద్దతు పొందేందుకు అనుచరులతో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి ఉప్పల్ టికెట్ కోసం ఆరుగురు నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఎం.పరమేశ్వర్‌రెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, మేకల శివారెడ్డి, పసుల ప్రభాకర్‌రెడ్డి, అమరిశెట్టి నరేందర్ ఉన్నారు. టికెట్ విషయంలో ముగ్గురి మధ్యే పోటీ ఉండగలదని పార్టీలో ప్రచారం సాగుతోంది. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే ఎన్‌ఎస్‌ఎస్ ప్రభాకర్‌తో పాటు మరో నాయకుడు పద్మారెడ్డి పోటీ పడుతున్నారు. అధిష్టానం మాత్రం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ వైపు మొగ్గు చూపవచ్చనే ప్రచారం పార్టీలో సాగుతోంది.

కూకట్‌పల్లి

బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మరోసారి కూకట్‌పల్లిలో ప్రచారం నిర్వహిస్తుండగా, కాంగ్రెస్ నుంచి కూకట్‌పల్లి టికెట్ కోసం 16 మంది నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ నుంచి దరఖాస్తు చేసుకున్న వారిలో గొట్టిముక్కల వెంగళరావు, సత్యం శ్రీరంగం, గాలివీర రామచంద్రబాలాజీ, పటోళ్ల నాగిరెడ్డి, వెలగపూడి వీపీఎస్ చౌదరి, మన్నె సతీష్‌కుమార్, ఆశపల్లి విజయచంద్ర, జాఫర్ అలీ, కొండకింది పుష్పారెడ్డి, దండుగుల యాదగిరి, మెడికొండ వెంకటమురళీ కృష్ణ, భక్త వత్సలం, జూలూరి ధనలక్ష్మీగౌడ్, పోట్లూరి శ్రీనివాస్‌రావు, దెరాటి మధుసాగర్, గొట్టిముక్కల పద్మరావు ఉన్నారు. కూకట్‌పల్లిలో బీజేపీ నుంచి అర్బన్ జిల్లా అధ్యక్షుడు పి.హరీష్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు మాధవరం కాంతారావు, కొత్తగా పార్టీలో చేరిన ప్రేమ్ కుమార్ పోటీ పడుతున్నట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది.

కుత్బుల్లాపూర్

సిట్టింగ్ ఎమ్మెల్యే కేపీ వివేకాందగౌడ్‌కు బీఆర్‌ఎస్ మళ్లీ టికెట్ కేటాయించడంతో.. అభివృద్ధి పనుల పేరుతో ప్రజల వద్దకు వెళ్తుండగా, కాంగ్రెస్ నుంచి టికెట్ కోసం 12 మంది నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. నర్సారెడ్డి భూపతిరెడ్డి, కొలన్ హన్మంత రెడ్డి, కందాడి జ్యోత్సదేవి, సొంటిరెడ్డి పున్నారెడ్డి, ఉసిరిక అప్పిరెడ్డి, మహ్మద్ నిజాముద్దీన్, గుంజ శ్రీనివాస్, బండి సత్యం గౌడ్, దూళిపాక సాంబశివరావు, పోలీసు సుమిత్రారెడ్డి, అహ్మద్ నిజామొద్దీన్, బోనగిరి ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. ఇక్కడ బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి పోటీకి ఆసక్తి చూపుతున్నారు.

రేపు ఉచిత మెగా హెల్త్ క్యాంప్



వైద్య శిబిరం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన గ్రేటర్ రాయలసీమ అసోసియేషన్ తెలంగాణ ప్రతినిధులు

కూకట్‌పల్లి: గ్రేటర్ రాయలసీమ అసోసియేషన ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన ఆదివారం కేపీహెచ్‌బీలోని రమ్యాగ్రౌండ్స్‌లో ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాఘవ్ బాణా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి హనుమంతరెడ్డి, అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్, సాక్షి ఫైనాన్స్ డైరెక్టర్ వైఈపీ రెడ్డి, మంజీరా కన్‌స్ట్రక్షన్స్ సీఎండీ గజ్జల యోగానంద్, సీనియర్ జర్నలిస్టు ఎంఈవీ ప్రసాదరెడ్డి, విద్వాన్ డాక్టర్ కసిరెడ్డి వెంకటపతిరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. ఈ శిబిరంలో జనరల్ ఫిజిషియన్, గైనకాలజిస్ట్, ఆర్థో, కార్డియాలజీ స్పెషలిస్టు వైద్యులతో పాటు ఉచిత రక్త, కంటి పరీక్షలు చేస్తారని తెలిపారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. పరిసర ప్రాంత ప్రజలు ఈ శిబిరంలో పాల్గొని ఉచిత సేవలు వినియోగించుకోవాలని తెలిపారు.

కార్పొరేటర్ పాదయాత్ర

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్, గాంధీనగర్, గురు గోవింద్‌సింగ్ నగర్, కేటీఆర్‌కాలనీ, జయశంకర్ కాలనీల్లో అధికారులతో కలసి శుక్రవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీల్లో ఇప్పటికే 90 శాతం పనులు పూర్తి చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు, స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చిన పనులను దశలవారీగా పూర్తి చేస్తామన్నారు. ఈ కాలనీల్లో ఎక్కువగా పారిశుద్ధ్య సమస్య ఉండటంతో సిబ్బందిని పిలిపించి చెత్తాచెదారాన్ని శుభ్రం చేయాలని ఆదేశించారు. ప్రజలు కూడా చెత్తను రోడ్డు మీద వేయకుండా చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని సూచించారు.

నేడు 500 మందికి డబుల్ ఇళ్లు ఇస్తాం

- 8విడతల్లో 4,400మందికి అందజేస్తాం
- ప్రతి బస్తీకి రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు అందించాం
- పాదయాత్రంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- 25 రోజులుగా కొనసాగుతున్న ఎమ్మెల్యే పాదయాత్ర



అల్లాపూర్ డివిజన్‌లో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, నాయకులు

మోతీనగర్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొమ్మిది సంవత్సరాల్లో అల్లాపూర్ డివిజన్ పరిధిలోని అన్ని బస్తీ, కాలనీల్లో రూపురేఖలు మార్చామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గతంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పరిపాలించిన కాలంలో అల్లాపూర్ డివిజన్ వైపు కన్నెత్తి కూడా చూడలేదని విమర్శించారు. అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్‌లతో కలిసి 25వ రోజు శుక్రవారం పాదయాత్రలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్, సఫ్దార్‌నగర్, యూసుఫ్ నగర్‌లలో పాదయాత్ర చేస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్, ఆధ్వర్యంలో తొమ్మిది సంవత్సరాల్లో ప్రతి బస్తీకి రోడ్లు, డ్రైనేజీ, ఇంటింటికీ మంచినీరు సమస్య పరిష్కారం చూపించామన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన 59 జీవో ప్రకారం రెగ్యులరైజేషన్ చేశామని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన ప్రతి ఒక్కరికి విడతల వారీగా ఇళ్లు అందజేస్తామని తెలిపారు. సెప్టెంబర్ 2వ తేదీన 500 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేస్తామన్నారు. మొత్తం 8 విడతల్లో 4,400 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ బెడ్‌రూమ్ ఇళ్లు అందజేస్తామన్నారు.

◆ కార్పొరేటర్ సబిహా బేగం మాట్లాడుతూ... ఏళ్లనాటి సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. మరోసారి ఎమ్మెల్యే కృష్ణారావును గెలిపించుకొని మరింత అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, ప్రధాన కార్యదర్శులు ముత్యాల దుర్గ, సయ్యద్ నజ్మా, సంక్షేమ సంఘం అధ్యక్షుడు సయ్యద్‌రియాజ్, రమేష్, అశు, సలావుద్దీన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆడియో సీడీ రిలీజ్



ఓల్డ్ బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రజల కోసం నిరంతరం చేస్తున్న చేసిన అభివృద్ధి, సంక్షేమంపై చేసిన పాటల సీడీని తయారు చేశారు. ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్,అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగం సమక్షంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సీడీని రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ ఏజాజ్, ఇర్ఫాన్, మేకల హరినాథ్, బుర్రి యాదగిరి, మట్టి శ్రీనివాస్, జేకే భాయ్,సలీం,ఖాదీర్ పాల్గొన్నారు.

నా మట్టి.. నా దేశం

- ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మట్టి సేకరణ
- కలశ పూజ నిర్వహించి యాత్ర ప్రారంభించిన బీజేపీ నాయకులు
- స్వాతంత్య్ర ఉద్యమంలో ప్రాణాలర్పించిన వీరుల త్యాగాలు వెలకట్టలేనివని వ్యాఖ్య



శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో మాధవరం కాంతారావు, బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి: భారతదేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలు అర్పించిన వీరుల త్యాగాలు వెలకట్టలేనివని కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు అన్నారు. భారత స్వాతంత్య్ర వజ్రోత్సవాల్లో భాగంగా దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల స్మారకార్థం దేశంలోని లక్షలాది గ్రామాల్లో శాసనాలు ఏర్పాటు చేయాలన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం కూకట్‌పల్లి అసెంబ్లీ పరిధిలోని బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు వినోద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన ×నా దేశం.. నా మట్టి (మేరా మాటి... మేరా దేశ్)₹కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాధవరం కాంతరావు హాజరై కలశ పూజ నిర్వహించి దివ్య మట్టిని నాయకులు కలిసి సేకరించారు. అనంతరం పెద్ద ఎత్తున జై శ్రీరాం నినాదాలు చేశారు.

కూకట్‌పల్లి గ్రామంలో..

◆ అదే విధంగా కూకట్‌పల్లి గ్రామంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అర్శనపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో ఆజాదీ కా అమృత మహోత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు శ్రీకర్ రావు, కుమారస్వామి, బలరాం రాజు, సోమశేఖర్, తిరుపతి, సంతోష్, అర్జున్, ప్రేమ్, సూరిబాబు, శివ, జ్యోతి, జగదీష్, వరదరాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

పర్వత్‌నగర్‌లో...

దేశం కోసం ప్రాణాలర్పించిన వీరులను స్మరించుకునేందుకు చేపట్టిన నా దేశం.. నా మట్టి కార్యక్రమాన్ని పర్వత్‌నగర్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిటైర్ ఆర్మీ జవాన్ భాస్కర్‌తో మట్టి సేకరణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అల్లాపూర్ డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ పులిగొళ్ల శ్రీలక్ష్మీయాదవ్, మేడ్చల్ ఓబీసీ వైస్ ప్రెసిడెంట్ పులిగొళ్ల శ్రీనివాస్‌యదవ్, అల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు విజయకుమార్, నాయకులు శంకర్ గంగపుత్ర, శివయాదవ్, బొంత హరికృష్ణ, స్వాతి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర అమృత్ వాటిక నిర్మాణానికి మట్టిని సేకరిస్తున్నాం..

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఆజాదీ కా అమృత్ మహోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఓల్డ్‌బోయిన్‌పల్లి బీజేపీ అధ్యక్షుడు సంతోష్‌గౌడ్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మట్టిని సేకరించారు. దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృత్ వాటిక నిర్మాణం కోసం ప్రతి గ్రామం నుంచి మట్టి సేకరణకు ప్రధాని మోదీ పిలుపు మేరకు ×నా మట్టి.. నా దేశం (మేరీ మాటి.. మేరా దేశ్)₹₹కార్యక్రమంలో భాగంగా మట్టిని సేకరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవికుమార్, సత్యమూర్తి, మహేందర్, మనోజ్‌యాదవ్, రఘు, కార్తీక్, నిఖిలేష్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.



రిటైర్ ఆర్మీ జవాన్ భాస్కర్‌తో మట్టిని సేకరిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు, బీజేపీ నాయకులు



కూకట్‌పల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో అర్శనపల్లి సూర్యారావు, నాయకులు



ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద మట్టిని సేకరిస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా హయగ్రీవ జయంతి, సంస్కృత భాషా దినోత్సవం

ఆల్విన్‌కాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కొనసాగుతున్న శ్రీవేంకటేశ్వర వేదాంతవర్ధిని సంస్కృత కళాశాలలో హయగ్రీవ జయంతి, సంస్కృత భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీమాన్ పరవస్తు గోవిందాచార్య, శ్రీమతి రంగనాయకమ్మ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన వేడుకలో శాస్త్ర, వేద పండితులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా డాక్టర్ శ్రీమాన్ పరవస్తు శేషావతారం, ముఖ్యఅతిథిగా ఉభయ వేదాంత ప్రవీణ శ్రీమాన్ సాతులూరి గోపాల కృష్ణమాచార్యులు, విశిష్ట అతిథులుగా ప్రొఫెసర్ పెన్నా మధుసూదన్, ఆత్మీయ అతిథులుగా వేదాంత ప్రవీణ శ్రీమాన్‌దరూరి రామానుజాచార్యులు, డాక్టర్ బానోత్‌సురేంద్రలు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అందులో భాగంగా పలువురు శాస్త్ర పండితులు, వేద పండితులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

మోతీనగర్: కాలానుగుణంగా వస్త్రాలు ధరించినట్లయితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఎగ్జిబిషన్‌లో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తయారు చేసిన చేనేత వస్త్రాలు, వివిధ రకాల చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు. నిర్వాహకుడు అక్బర్ ఆలీ మాట్లాడుతూ... ఈ ఎగ్జిబిషన్ ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 9.30గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు టి. గంగాధర్‌రావు, తాయార్ ఆలీ, నాయకులు గోపాల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్టు

సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

భాగ్యనగర్‌కాలనీ: మొబైల్ షాపులో దొంగతనానికి పాల్పడుతూ సెల్‌ఫోన్లు ఎత్తుకెళుతున్న ఓ వ్యక్తిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కేపీహెచ్‌బీ కాలనీ రోడ్డు నం.1లో గత నెల 13న ఓ మొబైల్ షాపులో దొంగతనానికి పాల్పడి సెల్‌ఫోన్‌లు దొంగిలించాడు. షాపు నిర్వాహకుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తుని చేపట్టారు. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి బహదూర్‌పేటకు చెందిన మండల యువరాజు (20) నగరానికి వచ్చి క్యాటరింగ్ పని చేస్తూ నివాసం ఉంటున్నాడు. జల్సాలకు అలవాటు పడిన యువరాజ్ పనికి పోతే వచ్చిన డబ్బులు సరిపోకపోవడంతో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. దొంగిలించిన సెల్ ఫోన్‌లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు యువరాజును అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాన్ని అంగీకరించాడు. దీంతో అతని వద్ద నుంచి 11 ఐఫోన్స్, 3 శామ్‌సంగ్ ఫోన్‌లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు శేషాద్రి పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.